చావు కవిత్వం

అజీజ్

"హలో, ఇన్స్పెక్టర్! ఎక్కడికీ ప్రయాణం?" అన్న పరిచిత కంఠం విని వెనుదిరిగేను. ఆయన నాతో బాటు క్రయింబ్రాంచిలో పనిచేసి ఈ మధ్యే రిటైరైన సీనియర్ ఇన్స్పెక్టర్.

"హలో సార్! బావున్నారా?" అన్నాను షేక్హేండ్ ఇస్తూ.

"ఆఁ, ఏం బావులే! రిటైరయ్యేక కుటుంబ సమస్యలు ప్రాణం తోడేస్తున్నాయనుకో. ఈమధ్యే మా చిన్నమ్మాయికి రాజమండ్రిలో ఓ సంబంధం ఖాయం జేశాం. ఆ పనిమీదే ఇప్పుడు వెళుతూంట... ఇంతకీ నువెక్కడికీ? మళ్ళీ ఏదైనా ఇన్వెస్టిగేషన్లో ఇరుక్కున్నావా?"

"నో సర్! ఈ హత్యలూ, ఖూనీలతో విసిగి నెల రోజులు సెలవు పెట్టి, త్రివేంద్రంలో ఉంటున్న మా అక్కయ్య యింటికి వెళ్తున్నాను, కొన్ని రోజులు ప్రశాంతంగా గడపాలని. బావగారక్కడ ప్రాజెక్ట్ ఇంజినీర్ గా పనిచేస్తున్నారు."

మా మధ్య మాటలు తుంచివేస్తూ, స్పీకర్ లో రాజమండ్రి మెయిల్ బయలుదేరబోతున్నట్టు ఎనౌన్స్ చెయ్యడంతో ఆయన నా భుజం తట్టి, "ఓ.కే. రాజారెడ్డీ! విష్ యూ బెస్టాఫ్ జర్నీ. వస్తాను" అంటూ వెళ్ళిపోయేడు.

రిస్టు వాచీ చూసుకున్నాను.

రాత్రి ఎనిమిది గంటలు.

అది మద్రాసు సెంట్రల్ స్టేషన్. వచ్చే పోయే రైళ్ళతో, ప్రయాణీకులతో ప్లేట్ ఫారమ్స్ రద్దీగా ఉన్నాయి.

నేను వెళ్ళవలసిన త్రివేంద్రం బండి ఎనిమిదిన్నరకి ఉంది.

టికెట్ తీసుకుని ఎదురుచూస్తున్నాను బండికోసం.

రైట్ టైమ్ కు పదినిముషాలు లేట్ వచ్చింది. సూట్ కేస్ అందుకుని ఫస్ట్ క్లాస్ కంపార్ట్ మెంట్ లో దూరేను.

"ఆ నాలుగో కేబిన్ ఖాళీగా ఉంది సార్!" అన్నాడు కండక్టర్.

"త్రివేంద్రం ఎన్ని గంటలకి చేరుతుంది బండి?" అడిగేను.

"ఉదయం ఆరున్నరకి!"

"త్రివేంద్రం చేరగానే కాస్త నిద్రలేపాలి నన్ను!" తెలూపేడు కండక్టర్.

కేబిన్‌లో వెళ్ళి, సూట్‌కేస్ పై బెర్త్‌మీద పెట్టేను. ట్రేన్ కదలగానే కేబిన్ తలుపు మూసి, బెర్త్‌మీద నడుం వాల్చేను.

చాలా రోజుల తరువాత వెళుతున్నాను అక్కయ్య ఇంటికి. నెల రోజులు హాయిగా గడపొచ్చు. ఆలోచిస్తూ కమ్మని నిదరలోకి జారుకున్నాను.

తెల తెలవారుతుండగా కేబిన్ తలుపు తట్టి లేపేడు కండక్టర్. కిటికీలోంచి తొంగి చూసేను. త్రివేండ్రం వచ్చేసింది!

సూట్‌కేస్ అందుకుని కేబిన్‌లోంచి బైటికి వచ్చేను. కారిడార్ గుండా ఒక్కో కేబిన్ దాటుకుంటూ తలుపు వైపు నడుస్తున్నాను. చివరి కేబిన్‌లో, కండక్టర్ ఓ వ్యక్తిని తట్టి లేపుతున్నాడు.

ఆ దృశ్యం చూడగానే, ఎందుకో నాకాళ్ళు బ్రేకులు వేసినట్టు ఆగిపోయేయి. కారణం, ఎంత తట్టి లేపడానికి ప్రయత్నిస్తున్నా ఆ వ్యక్తి లేవడం లేదు! అంత మొద్దు నిదర ఎవ్వరూ పోరు.

చూద్దామని లోన అడుగు పెట్టేను.

పై బెర్తుమీద అటు తిరిగి పడుకున్నాడతను.

"చూడండి సార్! అరిచి నా గొంతెండి పోతోంది. ఇంకా కుంభకర్ణుడు నయం. ఈపాటికి లేచేవాడు. ఈయనగారికి చీమ కుట్టినట్టుకూడా లేదు" అన్నాడు కండక్టర్ మొహం చిట్లిస్తూ.

ఆ ఊపులకి ఆ వ్యక్తి కాళ్ళదగ్గిరున్న న్యూస్ పేపరు ఒకటి జారి కిందపడింది. అప్రయత్నంగా దాన్ని అందుకున్నాను.

కండక్టర్ ఓడిపోయినట్టు, "ఇహ నావల్ల కాదు సార్!" అంటూ అవతలికెళ్ళబోయేడు.

అతన్ని ఆపి, అటుతిరిగి పడుకున్న ఆ వ్యక్తి భుజం పట్టి మా వైపు తిప్పేను.

అంతే!

కండక్టర్ కెవ్వుమన్నాడు!

క్షణంపాటు నాకూ మతిపోయింది.

ఆవ్యక్తి నుదురుమధ్య గుండ్రని రంధ్రం. ఆ రంధ్రం లోంచి చారలు చారలుగా మొహంమీద కారి, ఎండి పోయిన రక్తం. కళ్ళు రెండూ తెరచి వున్నాయి. ఆ కళ్ళల్లో జీవకళ శూన్యం.

"మైగాడ్! హత్య!" అన్నాడు కండక్టర్ వణుకుతూ.

ప్రాణంపోయి చాలా సేపయ్యింటుంది. శరీరం కర్రలా బిగుసుకుపోయింది.

"ఏ స్టేషన్‌లో ట్రేన్ ఎక్కాడితను?"

"మద్రాసులో సార్!"

"ఈ కేబిన్‌లో ఇతనివెంట ఇంకెవ్వరు ప్రయాణం చేసారు?"

"ఎవ్వరూ చెయ్యలేదు సార్, మద్రాసునుంచి ఒకడే వస్తున్నాడు."

"కేబిన్‌లో ఎవ్వరూ ప్రవేశించకుండా హత్య జరగడం అసంభవం. బాగా జ్ఞాపకం చేసుకొని చెప్పు!" అన్నాను.

కండక్టర్ కాసేపు ఆలోచించి "ఆఁ, గుర్తొచ్చింది సార్! మద్రాసులో ట్రేన్ బయలుదేరేక ఈ కాబిన్‌లో ఓ వ్యక్తి ఇతనితో మాట్లాడుతూ నిల్చోడం చూశాను.

అతని తలమీద ఫెల్ట్ హాట్ వుంది. లాంగ్ కోటు వేసు కున్నాడు. వీపు తలుపువైపు వుంది..."

"వారి మాటలు నీకు వినిపించలేదా?"

"ఒకే ఒక వాక్యం వినగలిగేను సార్! ఇతను ఆ వ్యక్తితో 'ఆ ఖ్యాతి నాది, నాది!' అంటున్నాడు. బండి ప్లాట్ ఫాం విడుస్తుండగా, ఆవ్యక్తి కేబిన్ తలుపుమూసి నడుస్తున్న ట్రేన్ లోంచి దిగిపోయేడు సార్..."

"అతన్ని మళ్ళీచూస్తే గుర్తుపట్ట గలవా?

కండక్టర్ కాసేపు ఆలోచించి, "గుర్తు పట్టగలను సార్!" అన్నాడు.

ఆలోచిస్తూ మరోసారి శవాన్ని చూసేను. శవం తల గడవైపు పెద్దసూట్ కేస్ వుంది. శవం దుస్తులూ, సామా నులు వెదికితే, అతని వ్యక్తిగత వివరాలు తెలుస్తాయి.

ఆ జంజాటం నాకొద్దు. కృష్ణా రామా అంటూ కొన్నాళ్ళు కులాసాగా గడుపుదామని వచ్చేను. మళ్ళీ ఇలాటి రొంపిలో ఇరుక్కోడం బుద్ధి తక్కువ.

"వెంటనే రైల్వే పోలీసులకి వివరాలు తెలియచేయ్. నే వెళతాను" అంటూ సూట్ కేసు అందుకొని ట్రేన్ దిగేను.

నన్ను రిసీవ్ చేసుకోటానికి స్టేషన్ వస్తున్నట్టు బావ ఉత్తరం రాసేడు. ఆయన కోసం ప్లేట్ ఫాం ఆ చివరి నుంచి ఈ చివరివరకు వెతికేను. కనిపించలేదు. ఓ కప్పు వేడివేడి టీ తాగివెళదామని స్టేషన్ కాంటీన్ లో దూరి ఓ టేబిల్ ముందు కూర్చున్నాను.

2

బేరర్ రాగానే టీకి ఆర్డరిచ్చేను. అప్పుడు పడింది దృష్టి నా చేతిలోవున్న న్యూస్ పేపర్ మీద! కేబిన్

లోంచి అనాలోచితంగా పట్టుకొచ్చానుదాన్ని.

టీ వచ్చేవరకూ తిరగేసి చూద్దామని పేపర్ విప్పేను. మద్రాసునుంచి వెలువడే ఇంగ్లీష్ పేపరు అది. అనుకోకుండా నా దృష్టి ఒకచోట నిలచింది.

సాధారణంగా పేపర్ నాలుగుపక్కలా కొంత ఖాళీ స్థలం వుంటుంది. మధ్యపేజీ కుడివైపు ఖాళీస్థలంలో, పెన్సిల్‌తో పద్యంలాంటి పంక్తులు ఒద్దికగా రాసి వున్నాయి. నాదృష్టిని ఆకట్టుకున్నవి అవే!

'ఎక్కడైతే ఎడారి పాడుతుందో...
ఎక్కడైతే శిధిలాలు కరుగుతాయో...
ఎక్కడైతే జంతువులు మాట్లాడుతాయో...
ఎక్కడైతే సముద్రం ఇగిరిపోతుందో...
అక్కడేవుంది భూలోక స్వర్గం!'

చదివి కాస్సేపు తెల్లబోయాను! నాకు కవిత్వంపట్ల అట్టే ఆసక్తిలేదు. ఐనా పద్యాలూ, గద్యాలూ చదివి అంతో ఇంతో అర్థం చేసుకోగలను.

కవిత్వం అనేది ఛందస్సూ, వ్యాకరణాల మీద ఆధారపడి వుంటుంది. ఈపద్యంలో అటు ఛందస్సుగానీ ఇటు వ్యాకరణంగానీ, ఒక అర్థంగానీ ఏమీ కనుపించడం లేదు.

అసలిది పద్యమేనా? లేక, ఉబుసుపోకకి రాసిన పిచ్చిరాతా? లేక, ఇందులో ఏదయినా గూఢార్థం దాగివుందా?

ఆలోచిస్తున్న నా కళ్ళలో ఇంతకుముందు చూసిన శవం మళ్ళీ ప్రత్యక్షమైనది. ఇరవై ఎనిమిదేళ్ళు వుండి వుంటాయతనికి. పెద్దపెద్ద కళ్ళు, ఉంగరాల జుత్తు,

మృత్యువు వల్ల మొహంకాస్త వికృతంగా మారినా, బ్రతివున్నప్పుడు మనిషి అందగాడే అయుంటాడు.

పాపం ఎవ్వరో దురదృష్టవంతుడు.

నాచూపులు మళ్ళీ పేపరుమీదకి మళ్ళేయి. అతను కవి అయుంటాడా? లేక, కొత్తగా కవిత్వం రాయటానికి తంటాలు పడుతున్నాడా? అర్థంపర్థంలేని ఇదేం కవిత్వం మరి?

ఎక్కడైనా ఎడారి పాడుతుందా? శిధిలాలు నడుస్తాయా? జంతువులు మాట్లాడుకొంటాయా? సముద్రం ఇగిరిపోతుందా? అంతా హాస్యాస్పదంగా వుంది. చివర్న 'అక్కడే ఉంది భూలోక స్వర్గం!' అంటున్నాడు.

ఈ ఒక వాక్యంలోనే ఏదో గాంభీర్యం ద్యోతకమాతున్నది. ఇది ఉబుసుపోకకి రాసిన రాతేనా? లేక, ఇందులో ఏదైనా గూడార్థం ఇమిడివుందా? ఆ గూడార్థమే అతని ప్రాణాంతకం కాలేదు కదా?

తీవ్రంగా ఆలోచిస్తోంది అలవాటుపడ్డ నామనస్తత్వం. దారినపోయే ఓ కథారచయిత కళ్ళముందు, ఏదయినా చిన్న సంఘటన జరిగిందీ అంటే, అందులో మరి నాలుగు మసాళాలు మేళవించి, ఓఘాటైన కథరాసే వరకూ అతని ప్రాణం ఊరుకోదు.

అట్లాగే మా పోలీస్ డిపార్టుమెంట్ వారికి ఇటువంటి స్యూరియస్ సంఘటనలు ఎదురయితే, వాటి లోతుపాతులు సొంతం తవ్విచూడందే మనసు తెరిపిన పడి చావదు.

ఇందులో నాకు ఒరిగేదీ, తరిగేదీ ఏమీలేదు. కాని, నా కుతూహల మనస్తత్వం ఓ పట్టాన వదిలిపెట్టనివ్వడం

లేదు. బేరర్ టీ పట్టుకురావడంతో ఆలోచనలు చెదిరి పోయేయి.

కప్పు ఖాళీచేసి లేవబోతుండగా "ఇక్కడ కూర్చున్నావటోయ్! నీకోసం ప్లాట్ ఫాం అంతా వెదికి విసిగి పోయాననుకో" అన్న బావ కంఠం విని వెనుదిరిగాను.

లేచి నవ్వుతూ షేక్ హాండ్ ఇచ్చేను. "రెండు నిమిషాలు లేటయింది నేను రావడానికి. పదపద మా అక్కయ్యా, రవీ నీకోసం కళ్ళల్లో వత్తులేసుకొని ఎదురు చూస్తున్నారు" అన్నాడు తొందర పెడుతూ.

బిల్ పే చేసి, సూట్ కేసుతో ఆయన వెనుక స్టేషన్ బయటకు వచ్చేను. అప్పుడే ఓ అంబులెన్సు కదులుతుండటం కనిపించింది. బహుశా, రైల్వే పోలీసులు ఆ యువకుడి శవాన్ని పోస్ట్‌మార్టంకు తరలిస్తున్నారు కాబోలు.

పార్కింగ్ లో బావ ఆఫీసుజీప్ ఆగివుంది. ఇద్దరం ఎక్కి కూర్చొన్నాం. డ్రైవర్ జీప్ స్టార్టుచేశాడు. నా ఆలోచనలు మాత్రం ఆ యువకుడి చుట్టే భ్రమరనాదం చేస్తున్నాయి. ఆ కవిత్వం గురించి, బావ ఏదయినా అభిప్రాయంవ్యక్తంచేస్తాడేమోచూద్దామని ఆ టాపిక్ ఎత్తేను.

"ట్రేన్ లో నాతోబాటు ఓ వ్యక్తి ప్రయాణం చేసేడు. అతనికి కవిత్వం పిచ్చి కాస్త ఎక్కువ మోతాదులో వున్నట్టుంది. దారి పొడవునా తను రాసిన కొత్త పద్యాలు వినిపిస్తూ వచ్చేడు.

అందులో ఒకపద్యంలోని అర్థం ఎంత ప్రయత్నించినా నా కర్థం కాలేదు. కాలేజీ లైఫ్‌లో, నువ్వుకూడా ఏవో పిల్లకవిత్వాలు అల్లేవాడివటగా? ఏదీ ఆ పద్యంలోని అర్థం ఏమిటో కాస్త వివరించు చూద్దాం!" అన్నాను.

"ఏమిటా పద్యం?" అడిగేడు బావ.

దాన్ని యథాతథంగా వినిపించేను ఆయనకి.

అంతా విన్న బావ పకపక నవ్వి, "ఏ మహానుభావు డైతే ఈ పద్యం నీకు వినిపించేడో, అతన్ని అడిగేవా? పిచ్చాసుపత్రినించి పారిపోయి ఎన్నాళ్ళయిందని?" అన్నాడు నవ్వాపుకుంటూ.

"నీకూ అర్థం కాకపోతే ఊరుకోరాదూ? అనవసరంగా ఇతర్లని ఎగతాళి చెయ్యడం దేనికి?" అన్నాను.

"ఇదీ ఒక పద్యమేనటోయ్? నిజంగా ఇది పద్యమే అయుంటే, ఆ మహానుభావుడెవ్వరో ఆధునిక కవి అయుంటాడు. ఆధునిక కవిత్వాలూ, చిత్రాలూ, శిల్పాలూ ఇలాగే ఉంటాయి మరి మానవమాత్రుడికి అర్థం కాకుండా!"

ఈయనదంతా హాస్య ధోరణి. ప్రతిదానికీ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు.

నాదంతా సీరియస్ ధోరణి మరి!

ఇంటిముందు జీప్ ఆగేవరకూ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. మెట్లమీద అక్కయ్య బాబునెత్తుకుని మా కోసమే ఎదురుచూస్తున్నట్టు నిల్చునుంది. నేను జీప్ దిగగానే, ఐదేళ్ళ ఆ చిట్టివెధవ చేతులాడిస్తూ, "పోలీస్ మావయ్యొచ్చాడు... పోలీస్ మావయ్యొచ్చాడు!" అంటూ కేరింతలు కొట్టసాగేడు.

ముందు అక్కయ్య పాదాలు తాకి, తరవాత వాణ్ణెత్తుకుని మొహామంతా ముద్దులతో నింపేను. వాడు చేతులు నా మెడచుట్టూ వేసి రాగాలు పోతున్నాడు.

"మీ మావయ్యని కాస్త ఊపిరన్నా తీసుకోనివ్వరా

బాబూ!'' అంటూ వాడి బుర్రమీద చిన్న మొట్టికాయ వేసేడు బావ.

"వచ్చినవాణ్ని గుమ్మంలోనే నిల్చోబెడదారేమిటి? లోపలికి రానివ్వండి!'' అంటూ ఇంట్లోకి నడిచింది అక్కయ్య.

డ్రైవర్ సూట్ కేస్ తెచ్చి ఇంట్లో పెట్టేడు.

"మావయ్యా! నాకోసం ఏం తెచ్చావ్'' అడిగేడు రవి.

"కొత్తగా మార్కెట్ లో వచ్చిన బొమ్మలన్నీ తెచ్చాను'' అంటూ సూట్ కేస్ తెరిచి వాడికోసం తెచ్చిన రకరకాల మరబొమ్మలు తీసిచ్చేను.

అవి చూడగానే వాడి ఆనందానికి పట్టపగ్గాలు తప్పేయి. ఆదరాబాదరా ఒక్కొక్కదానికి కీ ఇస్తూ ఆడించసాగేడు.

"స్నానానికి నీళ్ళు తోడేను. పోసుకో. అలసట తీరుతుంది... ఆఁహాఁ! వీడికోసం బొమ్మలకొలువొకటి పట్టుకొచ్చావన్నమాట. రేపీపాటికి చూడు. వాటి కాళ్ళూ, చేతులూ ఉంటాయేమో'' అంది అక్కయ్య ఆడుకుంటున్న రవిని చూసి.

"చూడు మావయ్యా! అమ్మ ఒక్క బొమ్మకూడా కొనివ్వదు'' అన్నాడు రవి తల్లిమీద ఫిర్యాదు చేస్తూ.

"నువ్వు వాటి కాళ్ళూ చేతులూ బుద్ధిగా ఉండనిస్తేగా కొనిచ్చేది?... వీడి ఫిర్యాదుకేంగానీ, నువ్వెళ్ళి త్వరగా స్నానం కానివ్వు. నీళ్లు చల్లారిపోతాయి.'' అంది అక్కయ్య నాతో.

బట్టలు మార్చుకుని బాత్ రూం వైపు నడిచేను.

3

మర్నాడు అందరం డైనింగ్ హాల్లో కూర్చుని బ్రేక్ ఫాస్ట్ చేస్తున్నాం.

రవి ముద్దుగా ఏవేవో కబుర్లు చెబుతున్నాడు నాతో.

"మామా, అల్లుళ్ళకి మంచి పొత్తు కుదిరింది. ఏమోయ్, త్వరగా పెళ్ళిచేసుకుని మావాడికో పెళ్ళాన్ని కనివ్వ రాదూ?" అంటూ ఛలోక్తి విసిరేడు బావ.

"ఏరా? నీకిప్పుడే పెళ్ళాం కావాలా?" అడిగేను రవిని.

అదేదో కొత్తబొమ్మ ఉంటుందనుకుని, "ఓ! కావాలి. ఆడుకుంటా!" అన్నాడు.

పకపక నవ్వేశాం ముగ్గురం.

అంతలో కాలింగ్ బెల్ మోగింది అవతలి గదిలో.

బావ పనిమనిషిని పిలిచి, "చూడు. ఎవ్వరో?" అన్నాడు.

పనిమనిషి వెళ్ళి వచ్చి, "నంబియార్ గారొచ్చా రండి!" అంది.

"నంబియారా? రమ్మను. రమ్మను." అన్నాడు బావ.

రెండు నిమిషాల తరవాత ఓ నలభై ఏళ్ళ వ్యక్తి నవ్వుతూ నిర్మొహమాటంగా వచ్చేడు డైనింగ్ టేబిల్ దగ్గరికి.

"హల్లో నంబియార్! టూర్నించి ఎప్పుడొచ్చావ్?" అంటూ లేచి ఎడంచేత్తోనే అతనికి షేక్‌హాండ్ ఇచ్చేడు బావ.

"నిన్ననే వచ్చాను. ఇహ వారంరోజులు సెలవే... బావున్నావా అమ్మా? రవీ! హవార్ యూ?" అన్నాడాయన అందర్నీ పలకరిస్తూ.

"మీట్ హిమ్! మై బ్రదర్ ఇన్ లా, ది గ్రేట్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి... ఈయన నంబియార్ అని నా థిక్ ఫ్రెండ్! మర్చంట్ నేవీలో రేడియో ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. దమ్మిడీ ఖర్చు పెట్టకుండా ప్రపంచం చుట్టి వస్తుంటాడు ఓడల్లో!" అంటూ పరస్పరం మమ్మల్ని పరిచయం చేసేడు బావ.

ఇద్దరం కరచాలనం చేసుకున్నాం. నంబియార్ కూర్చున్నాక, అక్కయ్య కాఫీ కలిపి ఆయన ముందు వుంచింది.

అప్పుడు తట్టింది నాకు సడన్ గా ఓ ఆలోచన. నంబియార్ ఓడల్లో దేశదేశాలు తిరుగుతూ, చిత్రవిచిత్రమైన అనుభవాలెన్నో గడించిన వ్యక్తి. ఆయన్ని ఆ పద్యంలోని విశేషాల గురించి ప్రశ్నిస్తే ఏమైనా తేల వచ్చు—అనుకుంటూ నంబియార్ వైపు తిరిగేను.

"ఉద్యోగరీత్యా మీరు దాదాపు ప్రపంచ దేశాలన్నీ చుట్టి వుంటారు. చిత్రవిచిత్ర ప్రదేశాలెన్నో చూసి వుంటారు. పాడే ఎడారిగురించి ఎక్కడైనా వినడం జరిగిందా?" అడిగేను.

'లేదు, వినలేదు!' అంటాడనుకున్న నంబియార్, చిన్నగా తలూపి, "వినడం ఏమిటి? స్వయంగా చూసేను!" అనడంతో నా మనసు ఉరకలు వేసింది.

"ఎక్కడుంది ఆ ఎడారి? దయచేసి కాస్త వివరంగా చెప్పండి" అన్నాను ఆతృతగా.

"హిందూమహాసముద్రంలో మనదేశానికి సంబంధించిన అనేక చిన్నా పెద్దా దీవులున్నాయి. అందులో సాన్ ద్వీపం ఒకటి. ఆ దీవి యావత్తూ ఇసుకతో నిండి

వుంటుంది ఎడారిలా! సముద్రం మీదుగా ప్రచండ గాలులు వీచినప్పుడు ఆ యిసుక ఒకచోటునుంచి మరో చోటుకి రివ్వున ఎగురుతుంది.

ఆ వేగానికి ఇసుక రేణువులు పరస్పరం రాసుకొని గాలిలో ఒక విచిత్ర శబ్దం సృష్టిస్తాయి. దానికి తోడు సముద్రం హోరు కలిసి, ఏదో వింత సంగీతంలా వినిపిస్తుంది. సాన్ అంటే స్థానిక భాషలో సంగీతం!" అని అన్నాడు నంబియార్.

ఎంత ఆశ్చర్యం! ఏ పద్యానికైతే అర్థం లేదనుకున్నానో, ఆ పద్యంలోనే ఇప్పుడు వింత అర్థాలు వెలికి వస్తున్నాయి.

"శిధిలాలు కదలడం ఎక్కడైనా చూశేరా?" అడిగేను అప్రయత్నంగా.

"చూసాను! సాన్ ద్వీపానికి మైలు దూరంలో సమ్ ద్వీపం వుంది. దానిపై ఒకప్పుడు మనుషులు నివసించేవారేమో, ఇప్పుడక్కడ శిధిలాలూ, రాళ్ళూ రప్పలూ తప్ప జీవరాశి లేదు.

ఆ ద్వీపంలోనే ఓ అగ్నిపర్వతం వుంది. ఏ కాలంలోనో అది పగిలి ,అక్కడ జీవరాశిని తుడిచిపెట్టి వుంటుంది. అందుకే అక్కడ మనుషులు మళ్ళీ స్థిరపడలేదనుకుంటాను.

తరవాత ఆ పర్వతం మళ్ళీ పగలలేదు కానీ, పర్వతం క్రింద లావా అప్పుడప్పుడూ చలించడం వల్ల ద్వీపం భూప్రకంపనానికి గురై అటూఇటూ ఊగుతోంది. దాంతో దానిపైవున్న శిధిలాలూ, రాళ్ళూ రప్పలూ కూడా కదులుతుంటాయి" అన్నాడు నంబియార్.

"ప్రపంచంలో మాట్లాడే పక్షులున్నాయని అందరికీ తెలిసిందే! రామచిలుక అచ్చు మనిషిలా మాటాడ గలుగుతుంది. కాని, మాటాడే జంతువుల గురించి ఎక్కడైనా విన్నారా మీరు?" అడిగేను.

నంబియార్ నవ్వేడు. "సీల్ జాతి చేపల గురించి మీరు చదవలేదా? ఆ రెండు ద్వీపాల చుట్టుప్రక్కల సముద్రంలో, సీల్ జాతి చేపలు అధికంగా నివసిస్తాయి. అవి తమ భాషలో విచిత్ర శబ్దాలుతీస్తూ పరస్పరం మాట్లాడుకుంటాయి."

"ఒక సముద్రం యావత్తూ నేలలో ఇగిరిపోతుందని నేనంటే మీరు నమ్మగలరా?" అడిగేను చివరిసారిగా.

ఈసారి నంబియార్ పెద్దగా నవ్వి "ఎడారి ప్రదేశాలలో సముద్రమేమిటి? మహా సముద్రాలే ఇగిరి పోతాయి కదా?" అన్నాడు.

తరువాత ఆయన ఏదో ఎంగేజ్‌మెంట్ వుందని, సెలవు తీసుకొని వెళ్ళిపోయేడు. బావకూడా తయారై ఆఫీస్ కెళ్ళిపోయేడు జీప్‌లో. రవి కాన్వెంట్‌లో కె. జి. క్లాస్ చదువుతున్నాడు. నేనొచ్చినందుకు ఈ రోజు వాళ్ళనని మారాంచేసి వుండిపోయేడు ఇంట్లో.

4

నా మస్తిష్కం నంబియార్ చెప్పిన విషయాలమీదే తీవ్రంగా ఆలోచిస్తోంది.

చనిపోయిన ఆ యువకుడు, పేపర్‌మీద పెన్సిలుతో రాసిన ఆ పద్యం ఊరికే ఉబుసుపోకకి రాయలేదనీ, ఆ వాక్యాల్లో అందరికీ అర్థంకాని అర్థాలు కొన్ని యిమిడి ఉన్నాయని స్పష్టమయింది.

చివర్న 'అక్కడే ఉంది భూలోక స్వర్గం!' అని రాసేడు.

ఏమిటది? ఏమిటి? ఏమిటి?

నంబియార్ చెప్పిన ఆ రెండు ద్వీపాల్లో ఏదయినా గుప్తనిధి దాగివుందా? ఇక్కణ్నించి సముద్రంగుండా ప్రయాణిస్తే, ఆ ద్వీపాలను త్వరగా చేరుకోవచ్చు. ఆ రహస్యాన్ని ఎలాగో కనుక్కున్న ఆ యువకుడు ఆ దీవులకెళ్ళి ఆ నిధిని చేజిక్కించుకుందామని ప్రయాణమయ్యేడా? ఆ ప్రయత్నంలోనే వున్న మరెవ్వరో అది అతని పరం కాకుండా మార్గమధ్యలోనే అతన్ని హత్య చేసేరా?

మద్రాసు స్టేషన్ నుంచి బండి బయలుదేరేక, ఆ యువకుడి కేబిన్‌లో ఎవ్వరో ఒకతన్ని చూసేననీ, బండిప్లాట్ ఫాం దాటబోతుండగా అతను దిగిపోయేడనీ చెప్పేడు కండక్టర్.

సందేహంలేదు. ఆ యువకుణ్ని చంపిన వ్యక్తిఅతనే! ఇంతలో, బావ ప్యూన్ వచ్చి ఆరోజు న్యూస్ పేపర్ ఇచ్చి వెళ్ళేడు. మొదటి పేజీలోనే ఆ యువకుడి శవం ఫోటో, తదితర వివరాలూ ప్రచురించేరు.

ఆత్రుతగా చదవసాగేను.

'ట్రేన్‌లో యువకుడి శవం!

త్రివేండ్రం, 9 జులై :- నిన్న ఉదయం ఆరున్నరకి త్రివేండ్రం చేరిన మెడ్రాస్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాస్ బోగీలో ఓ యువకుడి శవం బైటపడింది. ఎవ్వరో అతన్ని పిస్తోలుతో కాల్చి చంపేరు.

రైల్వే పోలీసులు శవం దుస్తులు తనిఖీచెయ్యగా,కొన్ని

కాగితాలు దొరికేయి. వాటి ఆధారంతో అతని పేరు నరేంద్రబోస్ అనీ, కలకత్తా నివాసి అనీ తెలిసింది. విచిత్రం ఏమిటంటే, అతని సూట్ కేసులోవున్న దుస్తుల మీదా దేశదేశాల లేబిల్స్ అంటించివున్నాయి.

చొక్కా కాలర్ పై హాంగ్ కాంగ్ గుర్తులూ, బూట్ల లోపల ఇండోనీషియా గుర్తులూ, రెడీమేడ్ పాంట్లపై టోక్యో గుర్తులూ వున్నాయి...పోలీస్ ఉన్నతాధికార్ల పర్యవేక్షణలో దర్యాప్తు చురుకుగా సాగుతోంది.'

పేపర్ మడిచి సిగరెట్ అంటించేను. కలకత్తానివాసి అయిన ఆ యువకుడు ఇంతదూరం ప్రయాణం కట్టడం, అతని వస్తువులమీద విదేశీ గుర్తులుండటం అంతా అగమ్యగోచరంగా వుంది.

అతను తరచూ విదేశాలు పర్యటిస్తుండేవాడా? అంత ధనవంతుడా? ఆపద్యం చివర ఉదహరించిన భూలోక స్వర్గం ఎక్కడుంది? ఏమిటిది? ఎలా కనుక్కోడం?

తీవ్రంగా ఆలోచిస్తున్న నాలో తళుక్కుమంది ఓ ఆలోచన. వెంటనేలేచి నా గదిలోకెళ్ళాను. సూట్ కేస్ తెరిచి రైటింగ్ పేడ్, చెక్ బుక్ అందుకున్నాను. టేబిల్ ముందు కూర్చుని, మద్రాసునుంచి వెలువడే రెండు మూడు దిన పత్రికలకు ఓ ప్రకటన తయారు చెయ్యసాగేను.

'ఎక్కడైతే ఎడారి పాడుతుందో...
ఎక్కడైతే శిధిలాలు కదులుతాయో...
ఎక్కడైతే జంతువులు మాట్లాడుతాయో...
ఎక్కడైతే సముద్రం ఇగిరిపోతుందో...
అక్కడేవుంది భూలోక స్వర్గం!'

ఈ పద్యంలోని అర్థాలు ఎవ్వరికయినా తెలిస్తే దయచేసి ఈ క్రింది చిరునామాతో సంప్రదించండి.' అని రాసి, పత్రికా ప్రకటనలకయ్యే డబ్బు చెక్కు రూపంలో జత చేసి విడివిడిగా కవర్లో పెట్టి అతికించేను.

ఆ యువకుణ్ని చంపిన హంతకుడు పత్రికల్లో ఈ ప్రకటన గనక చదివితే, ఆ పద్యంలో నిజంగా ఏదయినా రహస్యం దాగివుంటే తప్పకుండా నన్ను వెతుక్కుంటూ వస్తాడు.

అలా కాని పక్షంలో, ఇక ఇవన్నీ బుర్రలోంచి దులిపేసి బుద్ధిగా ఊరుకోడం ఉత్తమం! ఆ కవర్లు అందుకుని, అక్కయ్యతో బజారెళ్లొస్తానని చెప్పి తిన్నగా పోస్టాఫీస్ చేరుకున్నాను.

కవర్లు రిజిస్టర్డ్ పోస్ట్ చేసే వరకూ మనసు తెరిపిన పడలేదు.

5

రెండవరోజు దినపత్రికల్లో నేను పంపిన ప్రకటన ప్రచురించబడింది. పత్రికవాళ్ళు ఒకొక్క కాపీ నాకు ఉచితంగా పంపేరు. ఏం జరుగుతుందో చూద్దామని, మనసు చిత్రమైన కుతూహలంతో కొట్టుకుంటోంది.

పత్రికల్లో ప్రకటనపడి మూడు రోజులయినా ఒక్క ఉత్తరంగానీ, మనిషిగానీ రాలేదు. పడ్డశ్రమంతా దండగ అయిందని చిన్నబోయేను. ఇక ఆసంఘటన్ని పూర్తిగా మరిచిపోవడం మంచిదనిపించింది.

ఆరోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ ముగించి, నా గదిలో ఓ ఆంగ్లనవల చదువుతూ కూర్చున్నాను. బావ ఆఫీస్ కెళ్ళిపోయేడు. అక్కయ్య వంటగదిలో ఏదో సర్దుతోంది.

ఇంతలో రవి జారిపోతున్న పొట్టి నిక్కరు మీదికి లాక్కుంటూ పరిగెత్తుకొచ్చి "మావయ్యా! మావయ్యా! నీకోసం ఎవరో వచ్చారు," అన్నాడు.

"నాకోసమా?" అన్నాను ఆశ్చర్యంతో.

వాడేదో చెప్పబోతుండగా అక్కయ్య వచ్చి—"ఎవరో వచ్చార్రా నీకోసం! అర్జంటుగా కలవాలిట!" అంది.

ఆ ప్రకటన బాపతేనా? అనుకుంటూ పుస్తకం పక్కన పడేసి గబగబ ముందుగదిలో కెళ్ళాను. గుమ్మంలో నిల్చున్న వ్యక్తిని చూడగానే నా కనుబొమలు ముడిపడ్డాయి.

ముప్ఫయిలోపే వుంటుంది అతని వయసు. పొడుగు, పొడుక్కి తగ్గ వెడల్పాటి వక్షం. చురుకైన కళ్ళు, నల్ల తోలు జర్కిన్ వేసుకున్నాడు. చాక్లెట్ రంగు డబుల్ నెట్ పాంటు, కాళ్ళకి బెల్ షూస్.

నన్ను చూడగానే చేతులు జోడించి—"నమస్తే" అన్నాడు.

ప్రతి నమస్కారం చేసేను.

"రాజారెడ్డిగారు మీరేనా?"

"ఔను! మీరు?"

"నన్ను పుష్పనాథ్ అంటారు. పైలెట్ ఆఫీసర్ని. మూడురోజుల క్రితం మీ ప్రకటన చూసి, ఓసారి మిమ్మల్ని కలుసుకుందామని వచ్చేను."

నాగుండె గతి వేగం అందుకుంది. "రండి, కూర్చోండి!" అన్నాను సోఫా చూపిస్తూ.

అతను కూర్చున్నాడు.

అప్పటికే లోపలి కెళ్ళిన అక్కయ్య, పనిమనిషి చేత ట్రేలో కాఫీలు పంపింది. అతను మొహమాట పడకుండా, నేనిచ్చిన కప్పు అందుకుని, తాగి టీపాయ్ మీద పెట్టేడు.

"మీరు ఇండియన్ ఏర్ లైన్స్ పైలెటా? లేక, ఏర్ ఫోర్స్‌లో పనిచేస్తున్నారా?" అడిగేను.

"రెండూ కాదు! ఇక్కడ కార్గో అనే పెద్దమర్చంట్ కంపెనీ వుంది. వారికి రెండు రవాణా విమానాలున్నాయి. ఆ కంపెనీ ఇక్కణ్నించి కొబ్బరినూనె, కొబ్బరికాయలూ స్థానికంగా తయారయ్యే చేతిపని వస్తువులు ఇటు హాంగ్ కాంగ్, జకార్తా, సింగపూర్ వంటి ఏషియా దేశాలకూ అటు బాగ్దాద్, దుబాయ్, కువైట్, టెహ్రాన్ వంటి అరబ్ దేశాలకూ పంపిస్తుంది. ఆ విమానాలే నేను నడిపేది" అన్నాడతను.

"ఇప్పుడు చెప్పండి. పత్రికల్లో నేను ప్రకటించిన ఆపద్యం గురించి మీకేం తెలుసు?" అడిగేను అసలు విషయానికి వస్తూ,

"నిజానికి ఆ పద్యం గురించి నాకేం తెలీదు. మీ ప్రకటన చదివేక ఎందుకో మిమ్మల్ని ఓసారి కలుసుకోవాలనిపించింది. మీ అమూల్య సమయాన్ని అనవసరంగా పాడుచేస్తున్నానేమో అనిపిస్తోందిప్పుడు."

"అంటే పత్రికల్లో ఆ విచిత్ర ప్రకటన వేయించిన నేను ఓ వింతప్రాణి అయుంటానని చూసిపోదామని వచ్చారా?" అన్నాను కాస్త కేవురించిన మొహంతో.

"అబ్బే, అలా అనకండి! నా రాకకి ఓ ముఖ్యమైన కారణంకూడా ఉంది."

"ఏమిటిది?"

"ఇంత సేపూ అదే, ఎలా ప్రారంభించాలా అని తట పటాయిస్తున్నాను. విని మీరు నవ్వు..."

"నో... నో! ప్లీజ్, ప్రొసీడ్!" అన్నాను కుతూహలం ఆపుకోలేక.

అతను సిగిరెట్ అంటించి ప్రారంభించేడు. "నాతో బాటు కార్గో కంపెనీలో మరో పైలెట్ ఆఫీసర్ పని చేస్తున్నాడు. అతని పేరు ఉదయకుమార్. ఇద్దరం ప్రాణమిత్రులం. అతను హాంగ్ కాంగ్, జకార్తా, సింగపూర్ రూట్స్‌లో ప్లేన్ నడుపుతాడు. నేను అరబ్ దేశాలకి సరుకు చేరవేస్తుంటాను.

ఆరు నెలల క్రితం ఏషియా దేశాల్లో మా కంపెనీ సరుకుకు డిమాండ్ తగ్గటంవల్ల కంపెనీ రెండు విమానాలనీ అరబ్ దేశాలకే పంపడం ప్రారంభించింది. ఆ విధంగా నేనూ, ఉదయకుమార్ ఒకే రూట్‌లో వెళ్ళే అవకాశం ఏర్పడింది.

ఒకరోజు మేమిద్దరం మా మా విమానాల్లో బాగ్దాద్ నగరం చేరుకున్నాం. నేనక్కడే సరుకు దించెయ్యాలి. ఉదయకుమార్ అక్కడ తనవిమానంలో ఇంధనం నింపుకుని జోర్డాన్ దేశానికి సరుకు చేరవేసి రావాలి. తరవాత ఇద్దరం కలిసి తిరుగుముఖం పట్టాలి.

బాగ్దాద్‌లో ఇంధనం నింపుకుని జోర్డాన్‌కు బెలుదేరిన ఉదయకుమార్ నిర్ణీత సమయం దాటినా తిరిగి రాలేదు. నాకు చెప్పలేని భయంకలిగింది. కారణం, అతను అరబ్ దేశాలవైపు రావడం ఇదే ప్రథమం. అక్కడి ఎయిర్ రూట్స్ అంతగా తెలీవు.

అంతేగాక, అప్పుడప్పుడూ ఎడారుల్లో భయంకర మైన తుఫాను గాలులు లేచి ఆకాశాన్ని కమ్మేస్తుంది. దారి కనిపించదు. విమానాలు దారి తప్పే ప్రమాదం ఉంది.

చివరికి నా భయమే నిజమైంది. కంట్రోల్ రూంలో ఎంతోసేపు తంటాలు పడ్డాక తెలిసింది. సహారా ఎడారి మధ్య భీకరమైన తుఫాను చెలరేగిందనీ, ఉదయకుమార్ విమానం దారి తప్పిందని.

నా స్నేహితుణ్ని మళ్ళి చూస్తానో లేదో అని కృంగి పోయేను. కాని, నా అంచనా తారుమారుచేస్తూ ఉద యకుమార్, విమానంతో సహా క్షేమంగా తిరిగి వచ్చేడు. అప్పుడతని మొహం ఏదో భయంకర దృశ్యం చూసినట్లు పీక్కుపోయి, పసుపురంగులోకి మారి వుండటం గమ నించేను.

మూడు గంటల వరకూ ఆ తుఫానులో అతని విమానం రెక్కలు తెగిన పక్షిలా తల్లడిల్లి పోయిందట. కంట్రోల్ రూంనించి వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ పూర్తిగా తెగి పోవడం వలన దిక్కుతోచక, ఎంతో నేర్పుతో విమా నాన్ని కూలిపోకుండా కాపాడ గలిగేడట. బ్రతుకు జీవుడా అనుకుంటూ ఇద్దరం తిరుగు ముఖం పట్టాము.

ఆ రోజునుంచి ఉదయకుమార్‌లో హఠాత్తుగా ఏదో మార్పు రాసాగింది. ఏషియా రూట్స్‌లో విమానం నడపవలసిన వ్యక్తి, కంపెనీవారితో పేచీ పెట్టుకొని తను అరబ్ దేశాలకే విమానం నడుపుతానని మంకుపట్టు పట్టసాగేడు.

పైలెట్ వృత్తిలో అతను కాకలుతీరిన వాడు గనక'

కంపెనీ అతని మాట కాదనలేక మా డ్యూటీలు మార్చి అతన్ని అరబ్ రూట్‌లో వేసింది. ఉదయకుమార్‌లో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పుకు నేను ఆశ్చర్య పోయేను.

అడిగితే, తనకి అరబ్ దేశాలు నచ్చేయనీ, ఆ రూట్‌లోనే పనిచేస్తానని ఏవో పుల్ల విరుపుడు సమాధానా లిచ్చి తప్పించుకున్నాడు. అప్పటినించీ అతను ఖాళీ సమయాల్లో అరబ్ దేశాల మ్యాప్‌లను కుతూహలంగా, పరీక్షగా చూస్తూ గడపడం ప్రారంభించేడు.

అంతే కాదు, అతని చేతిలో ఎప్పుడూ అరబ్ దేశానికి సంబంధించిన ఏదో ఒక పుస్తకం ఉండటం గమనించేవాణ్ణి. ముఖ్యంగా ఆ పుస్తకాలు అరబ్బు పాశ్చాత్య నాగరికత గురించీ, ఎడారి చరిత్ర గురించీ ఉండేవి.

ఎప్పుడూ చలాకీగా, నవ్వుతూ ఎదటి వాళ్ళని నవ్విస్తూ ఉండే వ్యక్తి ఇప్పుడు శూన్యంలోకి చూస్తూ, ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ముభావంగా ఉండసాగేడు..."

"ఈ సంఘటనలకీ, ఆ పద్యానికీ, ఎక్కడా సంబంధం ఉన్నట్టు లేదే?" అన్నాను సహనం నశించి.

"ఇదంతా ఉపోద్ఘాతం అనుకోండి. ఇప్పుడు ఆ వైపే వస్తున్నాను. రెండు నెలల క్రితం, ఓరోజు రాత్రి నేనూ అతనూ విస్కీ తాగుతూ కూర్చున్నాం. ఎన్నడూ లేంది అతనా రోజు మోతాదుకు మించి తాగసాగేడు.

కొద్దిసేపటికే తప్పతాగి ఔటాఫ్ కంట్రోలయ్యేడు. ముద్ద ముద్దగా ఏవేవో వాగసాగేడు. ఆ మాటల్లోనే మీరు ప్రకటించిన ఆ పద్యం అతని నోటినుండి వెలువడింది..." పూర్తయిన సిగరెట్‌ని ఏష్‌ట్రేలో నొక్కడానికి ఆగేడు పుష్పనాథ్.

కుతూహలంతో నా గుండె వేగంగా కొట్టుకో సాగింది.

ఏష్‌ట్రేలో సిగరెట్ నలిపి, ప్రారంభించేడతను. "మత్తులో ఉన్న ఉదయకుమార్ నా భుజం తడుతూ, 'మైడియర్ ఫ్రెండ్! నువ్వు నా ప్రాణమిత్రుడివి. ఇన్నాళ్ళూ నా మనసులో దాచుకున్న ఓ రహస్యాన్ని ఈరోజు నీకు చెప్పేస్తున్నాను. దాన్ని ఎవ్వరికీ చెప్పక!

ఎందుకంటే, కొద్ది రోజుల్లో నేను ప్రపంచ ఐశ్వర్య వంతుల జాబితాలో చేరబోతున్నాను. ఇహ నాకీ ముష్టి ఉద్యోగం చేసే అవసరం లేదు. త్వరలో నా జీవితం భూలోక స్వర్గం కాబోతోంది.

ఎక్కడైతే ఎడారి పాడుతుందో...

ఎక్కడైతే శిథిలాలు కదులుతాయో...

ఎక్కడైతే జంతువులు మాట్లాడతాయో...

ఎక్కడైతే సముద్రం ఇగిరిపోతుందో...

అక్కడే ఉంది నా భూలోక స్వర్గం!' అంటూ నిషా ఎక్కువై ఇహ మాట్లాడలేక, ఒరిగి మూర్ఛపోయేడు.'

"ఉదయం అతన్ని మళ్ళీ ఆ విషయం అడగలేదా మీరు?"

"అడిగేను! రాత్రి తాగిన మైకంలో తనేం చెప్పేడో అతను పూర్తిగా మర్చిపోయేడు. పైగా, తను ఓవర్ లోడ్‌లో ఏదో వాగి ఉంటాననీ, పట్టించుకోవద్దనీ దాట వేసేడు. తరవాత నేనూ దాదాపూ ఆ విషయం మర్చి పోయేను.

ఆతరవాత ఉదయకుమార్‌లో మరో మార్పువచ్చింది. అప్పుడప్పుడూ సెలవు పెట్టి, మన దేశంలో పేరుపొందిన

ఆర్కియాలజిస్టులని కలుసుకునే ప్రయత్నాలు చెయ్యసాగేడు.''

''ఒక ప్రైవేట్ ఆఫీసర్‌కు పురాతత్వ శాస్త్రవేత్తలతో ఏం పని?''

''అదే నాకూ అర్థంకాకుండా వుంది. కంపెనీవారితో హరంచేసి, అరబ్ దేశాలకి డ్యూటీ మార్చుకోవడం, ఆ దేశాల మేప్స్ పరిశీలించడం, పుస్తకాలు చదవడం, ఈ మధ్య ఆర్కియాలజిస్టులతో సంపర్కం పెట్టుకోవడం... ఇవన్నీ ఆలోచిస్తే తప్పకుండా ఏదో మర్మం దాగివుందని తోస్తోంది!''

''ఇప్పుడతనెక్కడున్నాడు?''

''ఈ నెల ఒకటవ తేదీన జీతం తీసుకుని ఐదురోజులు సెలవుపెట్టి వెళ్ళేడు. అంతే! సెలవు ఐపోయి ఆరు రోజులు అవుతోంది. ఇంతవరకూ అతని జాడ లేదు. ఏమైపోయేడో అని విచారిస్తున్న నేను సడన్‌గా పేపర్లో మీ ప్రకటన చదివి, ఒక రోజు ఉదయకుమార్ చెప్పిన పద్యం జ్ఞాపకం వచ్చి, అనుకోకుండా మీ దగ్గరికి వచ్చేను, మీ ద్వారా అతని గురించి ఏమైనా తెలుస్తుందేమోనని.

కంపెనీవారు కూడా ఆందోళన పడుతున్నారు. అతని విషయంలో హైద్రాబాద్‌లో ఉన్న అతని ఇంటికి ట్రంకాల్ చేసి కనుక్కున్నాం. అతనక్కడికి రానే లేదుట! తరువాత అతను తిరుపతిలో ఓ పురాతత్వశాస్త్రవేత్తని కలుసుకోడానికి కలుసుకుందేవాడు. ఆయనకీ ట్రంకాల్ చేశాం. ఉదయకుమార్ జాడ అక్కడా దొరకలేదు! మరి ఏమయ్యేడు? ఉన్నపళాన ఎక్కడికి

మాయమయ్యేడు?" అన్నాడు పుష్పనాథ్ విచారంగా.

"మీ స్నేహితుని ఫోటో ఏదైనా వుందా మీదగ్గర?" అడిగేను.

"ఉంది. మీకు చూపించాలనే పట్టుకొచ్చేను. కాని, అది గ్రూఫ్ ఫోటో. ఓరోజు పది పన్నెండు మంది స్నేహితులం కలిసి, ఓ కొబ్బరి తోటలో పిక్నిక్ జరుపుకోడానికెళ్ళాం. అప్పుడు తీయించిన ఫోటో అది." అంటూ జర్కిన్ జిప్ లాగి, లోపలినించి ఓ కేబినెట్ సైజు ఫోటో తీసేడు పుష్పనాథ్.

రెండు కొబ్బరిచెట్ల నడుమ, పచ్చిక బయలుమీద స్నేహితులంతా మూడు వరుసల్లో నిల్చుని తీయించుకున్న ఫోటో అది. అందులో ఎక్కడున్నాడో వేలుపెట్టి చూపడానికి ముందుకు వంగేడు పుష్పనాథ్.

చేత్తో అతన్ని వారించి, "మీరు చూపకండి! వీరిలో మీ మిత్రుడెవ్వరో నేనే చూసి గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తాను" అన్నాను.

పుష్పనాథ్ తలూపేడు.

ఫోటోమీద దృష్టి నిలిపేను. కింది వరుసలో కూర్చునున్నాడు పుష్పనాథ్. అతని భుజంమీద మోచెయ్యి ఆనించి నవ్వుతున్న యువకుణ్ణి చూడగానే నా గుండె గుభిల్లు మంది!

ఊపిరి ఆగిపోయినట్టు రెప్ప వెయ్యకుండా ఆ రూపాన్నే చూస్తుండి పోయేను.

అతను ఎవ్వరో కాదు!

ఆ రోజు ట్రైన్‌లో నేను చూసిన శవం అతనిదే!!

ఏమిటీ విచిత్రం? ఆ శవం గుస్తుల్లో పోలీసులకి దొరి

కిన కాగితాల ప్రకారం అతని పేరు నరేంద్రబోస్. కల కత్తా నివాసి! పుష్పనాథ్ కథనం ప్రకారం అతని పేరు ఉదయకుమార్. హైద్రాబాద్ నివాసి! ఈ రెంటిలో ఏది నిజం? ఏది అబద్ధం?

హంతకుడు ఉదయకుమార్ని కాల్చి చంపి, పోలీసుల్ని తప్పుదారి పట్టించడానికి, నరేంద్రబోస్ పేరు గల తప్పుడు కాగితాలు ఉంచలేదు కదా? నా సర్వీస్ అనుభవాల దృష్ట్యా అలా అనేకసార్లు జరగడం నేను చూసేను. దీన్ని బట్టి, ట్రేన్‌లో చంపబడ్డ ఆ యువకుడు నరేంద్రబోస్ కాదు. ఉదయకుమారన్నమాట!

ఏషియా దేశాలవైపు విమానం తీసికెళ్ళే ఉదయకుమార్, అకస్మాత్తుగా అరబ్ దేశాలకి మ్యాటీ మార్చుకున్నాడు. తరవాత అతని చేతిలో ఎప్పుడూ అరబ్ దేశాల తాలూకు పుస్తకాలు కనిపించసాగేయి. తాగిన మైకంలో, ఒక రోజు తన మిత్రుడికి ఆ విచిత్ర పద్యం వినిపించి త్వరలో తను గొప్ప ఐశ్వర్యవంతుణ్ణి కాబోతున్నట్టు చెప్పేడు. ఈ మధ్య పురాతత్వశాస్త్రవేత్తల్ని కూడా కలుసుకోడం ప్రారంభించేడు.

వీటన్నిటినీ కూడి ఆలోచిస్తే, అరబ్బు దేశాల్లోనే ఎక్కడో ఆ పాడే ఎడారి ఉండి వుంటుందనిపిస్తోంది. ఆ రోజు నంబియార్ ఏవో గొప్పలు చెప్పుకోడానికి ఆ దీవుల గురించి నాతో కోతలు కోసి వుంటాడు. కొందరి తత్వం అంతే. గోరంత జ్ఞానాన్ని కొండంత ప్రదర్శించుకోడానికి ప్రయత్నిస్తారు.

ఉదయకుమార్ అరబ్ దేశాలపట్ల అంత ఆసక్తి చూపేడంటే, తప్పక అక్కడి ఎడారిలో ఏదో కనుగొని

వుంటాడు. సహారాఎడారి అరబ్ దేశాల చుట్టూ వ్యాపించి వుంది. ఆ రోజు ఆ ఎడారి తుఫానులో చిక్కుకున్న అతనికి, పైనించి ఏదో అద్భుత దృశ్యం కనిపించి వుంటుంది.

ఆ దేమిటో తెలుసుకుందామని తరవాత అరబ్ పాశ్చాత్య పుస్తకాలు చదవసాగేడు. పురాతత్వశాస్త్ర వేత్తల్ని కలుసుకోసాగేడు. అంతేకాదు, త్వరలో తను గొప్ప ఐశ్వర్యవంతుణ్ని కాబోతున్నట్టు కూడా చెప్పుకున్నాడు...

"ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టున్నారు" అన్న పుష్పనాథ్ పలకరింపుతో ఆలోచనా విహంగాలు తెగి, మళ్ళీ ఈ లోకంలోకి వచ్చేను.

"ఏం లేదు. ఇతనే కదూ మీ స్నేహితుడు ఉదయ కుమార్?" అంటూ ఫోటోమీద వేలు పెట్టి చూపేనతనికి.

పుష్పనాథ్ కళ్ళు తళతళ మెరిసేయి. "ఔను. ఇతనే! అంటే, మీరతన్ని కలుసుకున్నారన్నమాట. ఎక్కడ కలుసుకున్నారు?" అడిగేడు ఆతృతగా.

"సారీ! నే నతన్ని వ్యక్తిగతంగా కలుసుకోలేకపోయేను."

"మరి ఫోటోలో ఎలా గుర్తించగలిగేరు?"

"కొద్ది రోజులక్రితం అతన్ని ట్రైన్‌లో చూసేను."

"ఎక్కడ?"

"ఇక్కడే, త్రివేండ్రం స్టేషన్లో!"

"ఉదయ్ త్రివేండ్రం వచ్చేడా? ఎప్పుడు?"అడిగేడు పుష్పనాథ్ ఆశ్చర్యంగా.

"ఈ నెల ఏడవ తేదీన! సజీవంగా కాదు శవరూపంలో!!"

పక్కలో పిడుగు పడ్డట్టు అదిరి పడ్డాడు పుష్పనాథ్.

అతనికి నిదానంగా మొదటినించీ ఇప్పటివరకూ జరిగిన విషయాలన్నీ వివరించేను.

అంతా విన్న పుష్పనాథ్ మొహం పీక్కుపోయింది.

"ఓహ్, గాడ్!" అన్నాడు విచారంగా.

"మిస్టర్ పుష్పనాథ్! మీ స్నేహితుడి మరణానికి దారి తీసిన ఆ చావు కవిత్వంలోని మర్మమేమిటో మనం తెలుసుకు తీరాలి. ఉదయకుమార్ తరుచూ తిరుపతి కెళ్ళి ఎవ్వరో ఆర్కియోలాజిస్ట్‌ని కలుసుకు నేవాడని చెప్పేరు. అతనితో మాట్లాడితే ఉదయకుమార్ ఏం తెలుసుకోడానికి అతన్ని కలుసుకు నేవాడో మనకు తెలియావచ్చు. ఆయన పేరేమిటి?" అడిగేను సిగరెట్ అంటిస్తూ.

"ప్రొఫెసర్ నటరాజన్! ఆర్కియోలాజీలో ఆయనకి అంతర్జాతీయ ఖ్యాతి వుంది. మన దేశమే కాదు, విదేశాలు కూడా ఆయన్ని పిలిపించి త్రవ్వకాలు చేయించేవట. అంతేకాక, ఆయన పాశ్చాత్య లిపులు చదవడంలోనూ ఉద్దండ పండితుడుట.

ప్రస్తుతం తన వృత్తికి ఉద్వాసన చెప్పి తిరుపతిలో రెస్టు తీసుకుంటున్నాడుట. ఆయనే కాదు, ఆయన సోదరుడు ప్రొఫెసర్ రామచంద్రన్ కూడా పురాతత్వ శాస్త్రంలో మంచి ప్రావీణ్యం కలవాడుట!" అన్నాడు పుష్పనాథ్.

రిస్టువాచీ చూసుకుని, "సరే! రాత్రి ఎనిమిది గంటలకి వెళ్ళే మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరం కలిసి వెళదాం. అట్నుంచి మరో బండిలో తిరుపతి చేరుకోవచ్చు. మీరు సరిగ్గా ట్రైన్ టైమ్‌కి స్టేషన్‌లో కలుసుకోండి" అన్నాను.

పుష్పనాథ్ తలూపి, సెలవు తీసుకుని వెళ్ళిపోయేడు.

అప్పుడే ఓ ఆలోచన తట్టింది నాకు. ఓసారి సిటీ లైబ్రరీకెళ్ళి అరబ్బు పాశ్చాత్య నాగరికతకు సంబంధించిన పుస్తకాలు చదివితే, ఏవైనా క్లూస్ దొరకవచ్చు.

అక్కయ్యతో చెప్పి, టాక్సీ ఎక్కి బైలుదేరాను లైబ్రరీకి.

6

చాలా పెద్ద లైబ్రరీ అది.

ప్రతి విషయానికీ సంబంధించిన విభాగాలు విడివిడిగా విభజించేరు.

'వరల్డ్ హిస్టరీ అండ్ జాగ్రఫీ' విభాగంలో దూరి వెతకడం ప్రారంభించేను. రెండు గంటలు తంటాలు పడ్డాక దొరికేయి మూడు పుస్తకాలు. ఓ మూల కూర్చుని ఓపిగ్గా చదవడం ప్రారంభించేను. మొదటి రెండు పుస్తకాల్లో నాకావలసిన వివరాలేవీ కనిపించలేదు. మూడవ పుస్తకం ఓ ఆంగ్ల రచయిత రాసింది. కొన్ని పేజీలు తిరిగేశాక, ఓ హెడ్ లైన్ ఆకర్షించింది నన్ను.

వానర నగరం!

ఆ హెడ్ లైన్ చూడగానే సడన్‌గా ఓ విషయం జ్ఞాపకం వచ్చింది.

కోతులు తమ భాషలో పరస్పరం మాట్లాడుకుంటూ సైగలు చేసుకుంటాయి. వానరజాతి నించే నరజాతి రూపాంతరం చెందిందని సైన్సుసిద్ధాంతం. అవి మాట్లాడే జంతువులు!

ఉరకలు వేసే మనసుతో ఆ చాప్టర్ చదవసాగేను.

కొన్ని వేల సంవత్సరాల క్రితం సహారా ఎడారి మధ్య "దారాబ్" అనే నగరం ఉండేది. ఓ ఖలీఫా దాన్ని పాలించేవాడు. అతని ఖజానాలో వజ్ర వైడూర్యాలూ, రత్నాలూ, కెంపులూ, పచ్చలూ రాసులుగా వుండేవి.

అక్కడి ప్రజల జీవన విధానం మిగతా ప్రపంచానికి పూర్తి విరుద్ధంగా వుండేది. అక్కడి స్త్రీ, పురుషుల మీద ఎటువంటి ఆంక్షలూ, అడ్డుగోడలూ వుండేవి కావు. లైంగిక సంబంధాల విషయంలో విచ్చలవిడిగా జీవించేవారు. అందుకే ఈ చాప్టర్‌కు "వానర నగరం" అని పేరు పెట్టడం జరిగింది.

ఎక్కడి ప్రజల్లో నీతి నియమాలూ వుండవో ఆ రాజ్యం కలకాలం మనగలగదు. ఆ నగరం భగవంతుని ఆగ్రహానికి గురైనట్టు ఒకనాడు భయంకర భూకంపం వచ్చి నగరం యావత్తూ నామరూపాలు లేకుండా శిధిలమైంది. తరవాత ఎడారి తుఫానులు వీచి ఆ శిధిలాలన్నీ ఇసుకలో కూరుకుపోయేయి.

రాజుకు చెందిన ఆ మహాసంపద ఇప్పటికీ ఆ శిధిలాల్లోనే వుండిపోయింది. మహా సాగరం వంటి సహారా ఎడారిలో ఆ శిధిలాలని కనుక్కోడం దుస్సాధ్యం!

ఐనా, కొందరు ప్రాణాలకు తెగించి ఆ నగరాన్ని వెతకడానికి ప్రయత్నించేరు. సాధారణంగా వెళ్ళినవారు మళ్ళీ తిరిగి రాలేదు. ఒకరిద్దరు వచ్చినా, మతి స్థిమితం కోల్పోయి వచ్చేరు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కొన్ని సందర్భాల్లో ఆ ఎడారిమీదుగా విమానాలు తీసికెళ్ళుతున్న ఒకరిద్దరు పైలెట్లు, ఎడారి తుఫానులో చిక్కుకుని, దిక్కుతోచక ఆకాశంలో తిరుగుతున్నప్పుడు, అనుకో

కుండా ఆ నగరం శిథిలాలు వారి కంటబడటం జరిగింది.

తరవాత వెళ్ళి ఎంత గాలించినా ఆ శిథిలాలు మళ్ళీ కనిపించలేదు. దీన్ని బట్టి, తుఫాను చెలరేగినప్పుడు ఎడారి ఇసుక ఉవ్వెత్తున పైకి లేవడంతో కింద కూరుకుని వున్న ఆ శిథిలాలు వెలికి వస్తాయి. తిరిగి తుఫాను శాంతించడంతో ఇసుక యథావిధంగా వాటిమీద పేరుకు పోతుంది.

అందుకే అవి మళ్ళీ కనిపించవు!

చాప్టర్ పూర్తిచేసి, కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను.

అందులోని ఒకే ఒక పంక్తి నాలో మెదలుతోంది.

కొన్ని సందర్భాల్లో సహారా ఎడారిమీదుగా తీసి కెళ్తున్న పైలెట్లకు 'దారాబ్' నగర శిథిలాలు కనిపించాయి!

ఆనాడు ఆ ఎడారి తుఫానులో చిక్కుకున్న ఉదయ కుమార్ కూడా ఆ శిథిలాలు చూసేడా? వాటికోసమే ఇన్ని తంటాలు పడి, చివరికి ప్రాణాలు కోల్పోయేడా?

7

తిరుపతిలో ప్రొఫెసర్ నటరాజన్ ఇల్లు కనుక్కోడం పెద్ద కష్టం కాలేదు మాకు. ప్రొఫెసర్ కలుపుగోరు మనిషిలా కనిపించేడు. మమ్మల్ని సాదరంగా కన్సల్టింగ్ రూంలో కూర్చోబెట్టేడు.

పరస్పరం పరిచయాలయ్యేక, "చెప్పండి. నేను మీ కేవిధంగా సహాయపడగలను?" అన్నాడు.

"వారం రోజుల క్రితం ఉదయకుమార్ అనే వ్యక్తి మిమ్మల్ని కలుసుకున్నాడు కదూ?" అడిగేను.

ప్రొఫెసర్ తలూపి, "ఔను! అతడూ, అతని స్నేహితుడూ కలిసి తరుచూ వస్తుంటారు నా దగ్గరికి. చాలా చురుకైన యువకులు. ఐ లైక్ దెమ్. వాళ్ళే కాదు, ఆర్కియాలజీలో ఆసక్తి కలవారెందరో వస్తూ పోతుంటారు నా దగ్గరికి.

వారి సందేహాలకి ఓపిగ్గా సమాధానాలిచ్చి, సహాయ పడటం అలవాటుగా పెట్టుకున్నాను. మీరూ ఆ బాపతే అయ్యుంటారనుకుంటాను. ఉదయకుమార్ గురించే ప్రత్యేకంగా దేనికడిగేరు?" అన్నాడు ఆశ్చర్యంగా.

నేనూ, పుష్పనాథ్ ఒకరి మొహాలొకరం చూసుకున్నాం.

"ఉదయకుమార్ వెంట అతని ఫ్రెండుకూడా వచ్చేవాడా? ఎవ్వరతను? ఎలా వుంటాడు?" అడిగేను ఆత్రుతని ఆపుకోలేక.

"ఇద్దరూ దాదాపు సమ వయస్కుల్లాగే కనిపించేవారు. ఉదయకుమార్ తన స్నేహితుని పేరు త్రివిక్రమ్ అని చెప్పినట్టు గుర్తు. ఏం? అలా అడిగేరు?"

"కొన్ని విచిత్ర పరిస్థితుల్లో అతను ఈ మధ్యే మరణించడం జరిగింది!"

"వాట్! ఉదయ్ మరణించేడా? ఓహ్! రియల్లీ పిటీ న్యూస్. చాలా తెలివిగల అబ్బాయి. ఎడ్వెంచర్ అంటే ఇష్టపడే తత్వం. అతని మరణం నాకు చాలా విచారాన్ని కలిగిస్తోంది. అతను ఎలా చనిపోయేడు?" అడిగేడు ప్రొఫెసర్ విచారంగా.

"హత్య చెయ్యబడ్డాడు!"

ప్రొఫెసర్ ఆశ్చర్యంతో శిలా ప్రతిమలా చూస్తుండిపోయేడు కాసేపు.

తరవాత నిట్టూర్చి, "అదా సంగతి! అందుకే అతను మళ్ళీ నన్ను కలుసుకోలేదు" అన్నాడు.

"మళ్ళీ వచ్చి కలుస్తానని చెప్పి వెళ్ళాడా మీతో?"

"ఔను!"

"అతను మీ దగ్గర ఎటువంటి వివరాలు సేకరించడానికి వచ్చేవాడు?" అడిగేను అసలు విషయానికి వస్తూ.

"నానించి అతను తెలుసుకోదలచిన వివరాలు కొత్తవేం కాదు. అంతక్రితం ఎందరో ఆ వివరాలు తెలుసుకోడానికి నా దగ్గరకు వచ్చారు. నేను ఓపిగ్గా వారికి సమాధానాలిచ్చి పంపేవాణ్ని. మీ రెప్పుడైనా 'దారాబ్' అనే నగరం గురించి విన్నారా?" అడిగేడు ప్రొఫెసర్.

లేదన్నట్టు తల తిప్పేను.

"కొన్ని వేల సంవత్సరాల క్రితం సహారా ఎడారిలో ఆ నగరం వుండేది. ఒకనాడు ప్రకృతి వైపరీత్యానికి గురై శిథిలమైపోయింది. ఇప్పటికీ ఆ శిథిలాల్లో ఆ నాటి అఖండ సంపద దాగివుందని అరబ్ చరిత్ర చెబుతోంది.

ఆ సంపదనీ, దానితోబాటు అంతర్జాతీయ ఖ్యాతినీ స్వంతం చేసుకోడానికి, ఇప్పటికీ ఎందరో ప్రయత్నిస్తున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. ఐనా, గుండె నిబ్బరం గలవారు తెగించి ప్రయత్నిస్తూనే వున్నారు."

"ఉదయకుమార్ కూడా ఆ ప్రయత్నాల్లోనే మిమ్మల్ని కలుసుకునేవాడా?"

ప్రొఫెసర్ తలూపి, "ఔను. ఒక రోజు ఎడారి తుఫాన్‌లో చిక్కుపడ్డ అతనికి, పైనించి ఆ శిథిలాలూ, కళ్ళు చెదరగొట్టే ఏవో వస్తువులూ కనిపించేయట.

తరవాత వాటికోసమే కంపెనీ వారితో పోరి తన డ్యూటీ అరబ్ రూట్స్‌లో వేయించుకున్నాడుట. రెండవసారి వెళ్ళి విమానంలో ఆ ఎడారి ప్రాంతం గాలించినా, ఇసుక దిబ్బలు తప్ప ఆ శిథిలాల ఉనికికూడా కనిపించలేదుట.

దారాబ్ నగరం గురించి అతనెప్పుడో పత్రికల్లో వ్యాసాలు చదివేడుట. దాన్ని ఎలాగైనా శోధించి సాధించాలని కంకణం బూనాడు. పేరు పొందిన ఆర్కియాలజిస్టులతో సంప్రదించసాగేడు. ఆ ప్రయత్నాల్లో నేనన్నూ కలుసుకోడం జరిగింది. ఆ పని తనొక్కడివల్ల జరగదనుకుని, తన స్నేహితుణ్ని కూడా తోడు తీసుకున్నాడు సహాయంకోసం!

ఆ నగరాన్వేషణలో ఇదివరకు ఎందరు ప్రాణాలు పోగొట్టుకున్నారో అది ఎంతటి దుస్సాధ్యమో అతనికి వివరించి, ఆ ప్రయత్నాలు మానుకుని హాయిగా బ్రతకమని సలహా ఇచ్చేను.

ఐనా అతను తన మంకు పట్టు వదల్లేదు. అతనేకాదు అతనిలాగే ఒకరిద్దరు యువకులు నన్ను కలుసుకున్నారు, ఒకతను విమానంలోంచి ఆ శిథిలాల ఫోటోకూడా తీశానని వచ్చేడు. మీకా ఫోటో చూపిస్తానుండండి!''అంటూ లేచి లోనికెళ్ళాడు ప్రొఫెసర్.

రెండు నిమిషాల తరవాత, ఓ కేబినెట్ సైజు ఫోటో తెచ్చిమా ముందుంచేడు. చాలా ఎత్తునించి తీసిన ఫోటో అది. ఎడారి ఇసుకలో ఏవో విరిగి పడున్నట్టు చెల్లా చెదురుగా కనిపిస్తున్నాయి. వాటి మధ్య పెద్ద గొయ్యిలాటిది కూడా కనిపిస్తోంది.

"ఈ ఫొటో తీసినతను ఇవి దారాబ్ శిథిలాలే అంటాడు. కానని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఫోటో మధ్య గొయ్యి చూస్తున్నారా? అది ఎలా ఏర్పడిందో తెలుసా?

చెబుతాను వినండి. ఆకాశం నించి ఉల్కాలు తెగి భూమివైపు దూసుకు వస్తుంటాయి. 'ఉల్కాలు' అంటే కొందరికి త్వరగా బోధపడక పోవచ్చు. రాత్రుళ్ళు అప్పు డప్పుడూ ఏదో చుక్క ఉన్నట్టుండి రివ్వున కిందికి దూసుకుపోడం మనం చూస్తుంటాం. వాటినే మనం ఉల్కాలంటాం!

నిజానికవి రాళ్ళూ ఇతర ధాతువుల సమ్మేళనాలై వుంటాయి. తమ స్థానం వదిలి భూమివైపు దూసుకు వస్తూ, భూకక్ష్యలోకి ప్రవేశించగానే వాయు రేణువు లతో రాపిడికి గురై కాలి బూడిదగా మారతాయి.

ఒక్కోసారి వాటి తాలూకు పెద్ద పెద్ద ముక్కలు రాలిపోకుండా దూసుకు వచ్చి, భూమిని గుద్దుకుంటాయి. అప్పుడే ఇటువంటి గోతులు ఏర్పడతాయి. అందుకే అన్నాను ఇవి దారాబ్ శిథిలాలు కావని!" అన్నాడు ప్రొఫెసర్.

"ఉదయకుమార్ కూడా వీటినే చూసి దారాబ్ శిథిలాలనుకున్నాడంటారా?"

"కావచ్చు. అతను ఆ రోజు ఏ దిశలోనైతే తుఫానులో చిక్కుకున్నానని చెప్పేడో, ఆ స్థలంకూడా ఆ వైపే ఉంది మరి!" అన్నాడు ప్రొఫెసర్.

"అతని స్నేహితుడు త్రివిక్రమ్ చిరునామాగానీ, వివ రాలుగానీ ఏమైనా తెలుసా మీకు?"

"సారీ! నేను కనుక్కోలేదు."

"థాంక్యూ ప్రొఫెసర్! మీ అమూల్యమైన సమయాన్ని ఇలా దుర్వినియోగం చేసినందుకు మన్నించాలి!" అంటూ లేచాను.

"అదేం లేదు! ఆ యువకుడి మరణవార్తే నన్ను కలత పెడుతోంది" అన్నాడు ప్రొఫెసర్ విచారంగా.

ఆయన దగ్గిర సెలవు తీసుకుని ఇద్దరం బైలుదేరాం.

"ప్రొఫెసర్ వల్ల అతి ముఖ్యమైన విషయం తెలిసింది మనకు. అదే, ఉదయకుమార్ స్నేహితుడు త్రివిక్రమ్!" అన్నాను.

"ఔను! కొత్తగా వింటున్నాను ఆ పేరు. ఉదయ్‌కి ఆ పేరుగల స్నేహితుడున్నాడని కూడా నాకు తెలీదు" అన్నాడు పుష్పనాథ్ సిగరెట్ అంటిస్తూ.

"మీరిద్దరూ కూడా మంచి స్నేహితులే కదా? అతను మిమ్మల్నే తన పార్ట్నర్‌గా దేనికి ఎన్నుకోలేదు?"

పుష్పనాథ్ నవ్వి, "అతనికి నామీద నమ్మకం లేదేమో? కేవలం వృత్తిరీత్యా నాతో క్లోజ్‌గా ఉండే వాడేమో? అతనికి నాకన్నా ముఖ్య స్నేహితులెందరో వుండవచ్చుగా? వారిలో ఆ త్రివిక్రమ్‌ని ఎన్నుకుని వుంటాడు!"

సాలోచనగా తలూపేను. "దేనికో వారి మధ్య పొరపొచ్చాలొచ్చివుంటాయి. ఆ మహా నిధినీ, అంతర్జాతీయ ఖ్యాతినీ తానొక్కడే స్వంతం చేసుకుందామన్న దురాశతో త్రివిక్రమే తన స్నేహితుణ్ని చంపి వుంటాడు!" అన్నాను.

"కావచ్చు! చెప్పలేం. ఇప్పుడా త్రివిక్రమ్‌ని ఎక్కడ

వెతకడం?'' అన్నాడు పుష్పనాథ్ నిస్పృహతో.

''పోలీసులకి ఉదయకుమార్ శవంతోబాటు ట్రైన్‌లో అతని సూట్‌కేస్ కూడా దొరికింది. అందులో అతని డైరీ ఏదైనా వుండివుంటే, ఆ త్రివిక్రమ్ గురించి ఏమైనా ఆచూకి తెలియవచ్చు.

లేదా, హైద్రాబాద్ ట్రంకాల్ చేసి అతని ఇంటి వాళ్ళని వాకబ్ చేద్దాం. ఉదయకుమార్ స్నేహితుల్లో త్రివిక్రమ్ పేరు గల వారెవ్వరైనా ఉన్నారా అని' మనం త్రివేంద్రం చేరేసరికి రాత్రి పన్నెండవుతుంది' రేపు ఉదయం ఇంటికి వచ్చి నన్ను కలుసుకోండి' అన్నాను.

పుష్పనాథ్ తలూపేడు.

8

ఉదయం బ్రేక్‌ఫాస్టయ్యాక, పేపర్ తిరగేస్తూ పుష్పనాథ్ కోసం ఎదురుచూస్తున్నాను.

నా కళ్ళు పేపర్ మధ్య పేజీలో ప్రచురించిన ఓ హెడ్‌లైన్ని అయస్కాంతంలా ఆకర్షించేయి.

'సహారా ఎడారి ప్రాచీన నగరం కనుగొనబడింది!'

మద్రాసు 14:— బాంబే ఇంటర్నేషనల్ ఏజెన్సీ ద్వారా అందిన సమాచారాన్ని బట్టి, వేల సంవత్సరాల క్రితం సహారాఎడారిలో కూరుకుపోయిన 'దారాబ్' అనే ప్రాచీన నగరం ఈనాడు కనుగొనబడింది.

ఆ శిధిలాల్లో కొన్ని కోట్లు విలువచేసే వజ్ర వైడూర్యాలు నిక్షిప్తమై వున్నాయి. ఆ ప్రాచీన సంపదను కనుగొనడానికి ఇదివరకెందరో ప్రాణాలు పణం గావించేరు.

దుస్సాధ్యమనుకున్న ఆ నిధిని కనుగొని, కృత నిశ్చ

యంలో శ్రమిస్తే ఈ సృష్టిలో అసాధ్యమేదీ లేదని మరోసారి ఋజువు చేశాడు మానవుడు. ఆ ఖ్యాతి మన దేశ పురాతత్వ శాస్త్రవేత్తలకే లభించడం ముదావహం!

ఆయన పేరు ప్రొఫెసర్ రామచంద్రన్. ప్రఖ్యాత ఆర్కియోలజిస్ట్ ప్రొఫెసర్ నటరాజన్ గారి సోదరుడాయన. ప్రొఫెసర్ నటరాజన్ ప్రస్తుతం తమ వృత్తిని సోదరుడైన రామచంద్రన్‌కు అప్పగించి, తిరుపతిలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఈనాడు 'దారాబ్' అవశేషాలు కనుగొని, ప్రొఫెసర్ అన్న ఖ్యాతినికూడా ఆధిరోహించేడు. ఆ శిధిలాలు బయల్పడిన ప్రదేశం జోర్డాన్ దేశ సరిహద్దులో వుంది గనుక, జోర్డాన్ రాజు ఇదివరకు ప్రకటించిన విధంగా ఆ నిధిలో సగం రామచంద్రన్‌కు ఇచ్చి తమ కృతజ్ఞతలు తెల్పుకుంటారు! భారతీయులకిది నిజంగా గర్వకారణం!''

నిదరలో జోగుతున్న వ్యక్తి పక్కలో హఠాత్తుగా టపాకాయ పేలితే అదిరిపడి కళ్ళు తెరిస్తాడు. సరిగ్గా అలా అయింది నా స్థితి ఇప్పుడు.

గిరగిర తిరుగుతున్న బుర్రని అదుపులో పెట్టడానికి సిగరెట్ తీసి అంటించేను. అది పూర్తయ్యేవరకు తీవ్రంగా ఆలోచిస్తూ ఓ నిశ్చయానికి వచ్చి లేచాను.

ఇంట్లో ఎక్కడికెళ్తున్నానోకూడా చెప్పకుండా టాక్సీ ఎక్కి హుటాహుటిన త్రివేండ్రం పోలీస్ హెడ్ క్వార్టర్స్ చేరుకున్నాను.

ఉదయకుమార్ హత్యకేసు దర్యాప్తు చేస్తున్న డి. ఎస్. పి గార్ని కలుసుకుని, నన్ను నేను పరిచయం చేసుకుని, మొదటినించీ జరిగిన విషయాలన్నీ సమగ్రంగా ఆయనకి వివరించేను.

ఇంతవరకూ ఆ కేసు తలా తోకా అందక తికమక పడుతున్న ఆయన, నా పరిశోధనా వివరాలు విని ఆనం దాన్ని అనుపులో పెట్టుకోలేక పోయేడు.

"ఉదయకుమార్ శవం బైటపడిన రోజు, ఏ కండక్టరైతే ఆకంపార్టుమెంట్ లో ఉన్నాడో అతన్ని తక్షణం వెదికించి మీ కస్టడీలోకి తీసుకోండి. ఆలస్యం చెయ్యకూడదు. రైల్వే అధికార్లని వాకబ్ చేస్తే ఆ కండక్టర్ వివరాలు తెలుస్తాయి!" అన్నాను తొందరపెడుతూ.

"ఓ.కే! అదెంతసేపు?" అంటూ బల్లమీది కాలింగ్ బెల్ మోగించాడాయన.

9

"హల్లో, ప్రొఫెసర్! గుడీవినింగ్!" అన్నాను నవ్వుతూ.

"గుడీవినింగ్ మిస్టర్ రాజారెడ్డీ! రండి. కూర్చోండి. ఆ హంతకుడి ఆచూకి ఏమైనా తెలిసిందా?" అడిగేడు ప్రొఫెసర్ నటరాజన్ సాదరంగా నన్ను ఆహ్వానిస్తూ.

"తెలిసింది! అదే మీతో చెప్పాలని ఇలా వచ్చేను."

"వెరీ గుడ్! ఎవరా హంతకుడు?"

నా కంఠం మారిపోయింది. "ఇంకా ఎవ్వరో కాదు నువ్వే!" అన్నాను అతన్ని వురిమి చూస్తూ.

ప్రొఫెసర్ మొహం కోపంతో జేవురించింది. "మిస్టర్! ఏమిటీ పిచ్చి ప్రేలాపన? నేనెవ్వర్నో తెలిసే మాట్లాడుతున్నావా?" అన్నాడు తీక్షణంగా.

"ఔను. అంతా తెలిసే మాట్లాడుతున్నాను ప్రొఫెసర్! ఇక దాచి లాభంలేదు. నిన్న సాయంత్రం వరకూ నీమీద నాకు అనుమానపు వాసన కూడా వెయ్యలేదు. ఈరోజు ఉదయం పేపర్ చూడగానే, నా కళ్ళముందు

కమ్ముకున్న మబ్బుతెరలన్నీ తొలగిపోయేయి. సహారా ఎడారిలో 'దారాబ్' నగర శిథిలాలను నీ తమ్ముడు కనుగొన్నాడా?

మీ అన్నా తమ్ముళ్ళిద్దరూ బ్రహ్మాండమైన నాటకం ఆడి, ఇటు పోలీసుల్నే కాదు, అటు ప్రపంచాన్నే మోసం చేశారు. నిజానికి, ఆ ఖ్యాతి చెందగలసిన వ్యక్తి ఉదయకుమార్!

సహారా ఎడారిలో, ఆ నగర శిథిలాలున్న ప్రదేశాన్ని అష్ట కష్టాలు పడికనుగొన్న ఉదయకుమార్, వాటి త్రవ్వకంలో నీ సహకారం తీసుకుందామని, నిన్ను కలుసుకుని తను కనుగొన్న విషయాలు, ఫోటోలు వెల్లడించేడు.

అప్పుడే నీలో దురాశ మొలకెత్తింది. అటువంటి అపార సంపదా, అంతర్జాతీయ ఖ్యాతీ ఒక మామూలు వ్యక్తి పరం కాకుండా మీరే దక్కించుకోవాలనుకున్నారు.

అతను కనుగొన్న వివరాలు సరైనవి కావని, పొరపాటు అంచనాలనీ నిరుత్సాహపర్చి పంపేరు. అతనా వివరాలు మరెవ్వరికీ చెప్పకముందే పైలోకం పంపెయ్యాలని, అతన్ని వెంబడిస్తూ మద్రాసు చేరుకున్నావు. అతను త్రివేంద్రం వెళ్ళడానికి మద్రాసు స్టేషన్లో బండి మారగానే అతని కేబిన్లో కళ్ళావు.

నిన్ను చూసి ఉదయకుమార్ తెల్లబోయి వుంటాడు. అతన్ని కాసేపు కబుర్లలో పెట్టి, బండి కదలగానే పిస్తోలుతో కాల్చి, పోలీసుల్ని తప్పుదోవ పట్టించడానికి నరేంద్రబోస్ పేరుగల తప్పుడు కాగితాలు అతని జేబుల్లో దాచి, నడుస్తున్న ట్రేన్లోంచి దిగిపోయేవు.

తరవాత, ఉదయకుమార్ చెప్పిన ప్రదేశంలో ఆ

శిధిలాల తవ్వకానికి నీ తమ్ముణ్ణి జోర్డాన్ పంపేవు... నేనూ, పుష్పనాథ్ నిన్ను కలుసుకున్నప్పుడు, ఉదయ కుమార్ వెంట ఎవ్వరో త్రివిక్రమ్ అనే స్నేహితుడు వచ్చేవాడని చెప్పి, మా అనుమానం ఆ అమాయకుడి మీదికి మళ్ళించాలని ప్రయత్నించేవు...''

ప్రొఫెసర్ మధ్యలో పకపక నవ్వి, ''కథ బాగుంది! కాని, ఈ కాకమ్మ కథని కోర్టువారు ఎలా నమ్ముతారను కున్నావ్?'' అన్నాడు.

ఈసారి నవ్వడం నావంతయింది. ''నానోటి మాటగా చెబితే నమ్మరు. నిజమే. కోర్టువారిని నమ్మించడానికి నా దగ్గర సాక్ష్యం వుంది ప్రొఫెసర్!'' అంటూ తలుపువైపు చూశాను.

సరిగ్గా అదే సమయంలో, ఆనాటి రైల్వే కండక్టర్, కేరళ పోలీస్ డి. ఎస్. పీ, ఇద్దరు కానిస్టేబుళ్ళూ వంతుల వారిగా లోన అడుగుపెట్టేరు.

కండక్టర్, ప్రొఫెసర్ని చూడగానే—''ఆ రాత్రి ఇతనే సార్ ఆ యువకుడితో మాట్లాడి, బండి దిగి పోయింది!'' అన్నాడు దాదాపు అరుస్తూ.

''ఈ మాత్రం సాక్ష్యం చాలా ప్రొఫెసర్, నీకు యావజ్జీవ శిక్ష పడటానికి?'' అన్నాను నవ్వుతూ.

పాపం, ఈపాటికి ప్రొఫెసర్ కళ్ళల్లో చీకట్లు కమ్ము కున్నుంటాయి. నిల్చోలేక, ఉన్నపళంగా సోఫాలో కూలబడిపోయేడు.

నిట్టూర్చేను తృప్తిగా!

—: ఐపోయింది :—